

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5 । కనిష్ఠం 17.6

టీటీడీలో 15 నుంచి నిత్యాన్నదానం ప్రారంభం

బీర్కూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానం సన్నిధిలో ఈ నెల 15 నుంచి నిత్య అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 15వ తేదీన ఆలయ ధర్మకర్తలు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, శంభురెడ్డిలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి రావాలని సభ్యులు కోరారు.

నష్ట పరిహారం తేల్చంది..
సర్వే ఎలా చేస్తారు?



రోడ్డు నిర్మాణాన్ని సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

- వంద ఫీట్ల రోడ్డు మార్కింగ్‌ను అడ్డుకున్న రైతులు
- రోడ్డు నిర్మాణానికి పది గుంటలు పోతే తాము తీవ్రంగా నష్టపోతాం
- దేవునిపల్లి, లింగాపూర్‌కి చెందిన పలువురు రైతుల ఆవేదన
- ప్రైవేట్ వెంచర్ల కోసమే వందఫీట్ల రోడ్డు ఏర్పాటు చేస్తున్నారా !?
- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు

కామారెడ్డి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణ శివారుల్లోని లింగాపూర్‌గేట్ నుంచి పాత ఎన్‌హెచ్-7 రోడ్డు సబ్‌స్టేషన్ వరకు నూతనంగా నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసిన వంద ఫీట్ల రోడ్డు వివాదాస్పదంగా మారుతోంది. లింగాపూర్ గేటు నుంచి సబ్‌స్టేషన్ వరకు సుమారు అరు కిలోమీటర్ల మేర వందఫీట్ల రోడ్డుతో పాటు 83 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. అయితే ఇందులో పెద్ద మొత్తంలో వ్యవసాయ భూమి ఉన్న యజమానులు రోడ్డు నిర్మాణానికి భూమి స్వచ్ఛందంగా ఇచ్చేందుకు ముందుకు రాగా దేవునిపల్లి, లింగాపూర్‌కు చెందిన చిన్న, సన్నకారు రైతులు తమ భూమి ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. ఉన్న పది గుంటల భూమి వందఫీట్ల రోడ్డుకే పోతే తాము తీవ్రంగా నష్టపోతామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు రెండ్రోజులుగా సర్వే చేస్తున్నారు. బుధవారం బాధిత రైతుల భూముల్లో టౌన్‌ప్లానింగ్ అధికారులు సర్వే చేసేందుకు వెళ్లగా రైతులు అడ్డుకున్నారు. తమకు సమాచారం ఇవ్వకుండా, నష్టపరిహారం తేల్చకుండా తమకు ఉన్న కొద్దిపాటి భూముల్లో ఎలా సర్వే చేస్తారంటూ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందిని నిలదీశారు. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారులు సర్వే చేయకుండా వెనుతిరిగారు.

గతంలోనే వంద ఫీట్ల రోడ్డు ప్రతిపాదన

కామారెడ్డి జిల్లా కేంద్రంగా ఏర్పడడంతో పట్టణ శివారు ప్రాంతాలు విస్తరించాయి. భవన నిర్మాణాలు ఆ స్థాయిలోనే కొనసాగుతున్నాయి. దీనికి తోడు పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ప్రధానంగా కామారెడ్డి కొత్త బస్టాండ్ నుంచి మొదలుకొని నిజాంసాగర్ చౌరస్తా, రైల్వే కమాన్, దేవునిపల్లి వెళ్లే నిజాంసాగర్ రోడ్డులోను వాహనాల రాకపోకలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తీర్చేందుకు, భారీ వాహనాలను పట్టణంలోకి రాకుండా బైపాస్ లాంటి మరో రహదారిని ఏర్పాటు చేయాలని గతంలో ప్రజాప్రతినిధులు మున్సిపల్ అధికారులు వందఫీట్ల రోడ్డు లింగాపూర్ గేటు నుంచి పాత కలెక్టరేట్ సబ్‌స్టేషన్ వరకు వేయాలని ప్రతిపాదించారు. అప్పటి ప్రభుత్వం ఈ వందఫీట్ల రోడ్డుకు రూ.6కోట్ల నిధులు కూడా మంజూరు చేసినట్లు అప్పటి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే కొత్త ప్రభుత్వం రావడంతో రోడ్డు నిర్మాణానికి కేటాయించిన నిధులను క్యాన్సల్ చేసింది. అయితే ఇటీవల ఈ వందఫీట్ల రోడ్డు నిర్మాణం తెరమీదకి వచ్చింది. ప్రధానంగా కామారెడ్డి పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీర్చడం, భారీ వాహనాలను కామారెడ్డిలోకి ఎంట్రీకానివ్వకుండా, చెరుకు లోడ్ ట్రాక్టర్, లారీలను, నిజామాబాద్ నుంచి వచ్చే వాహనదారులకు రాకపోకల సౌకర్యార్థమై ఈ వందఫీట్ల రోడ్డును ఏర్పాటు చేయాలనేదే ఉద్దేశం.

హైటెన్షన్ లైన్ కింద కాకుండా పక్కకు జరపడం ఎందుకో?

నిజాంసాగర్ రోడ్డులోని లింగాపూర్ గేటు నుంచి సబ్‌స్టేషన్ వరకు సుమారు 6 కిలో మీటర్ల వరకు కొద్దిదూరంలో వందఫీట్ల రోడ్డు అక్కడి నుంచి 83 ఫీట్ల రోడ్డు వేసేందుకు ప్రతిపాదించారు. ఇందుకోసం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు మార్కింగ్ సైతం మొదలుపెట్టారు. లింగాపూర్ గేటు నుంచి సుమారు 300 మీటర్ల వరకు వందఫీట్ల రోడ్డు, అక్కడి నుంచి 5.5 కిలో మీటర్ల వరకు 83 ఫీట్ల రోడ్డు వేయాల్సి ఉంది. అయితే 83 ఫీట్ల రోడ్డు వేసే 5 కిలో మీటర్ల వరకు హైటెన్షన్ లైన్ ఉండడంతో దానికిందనే రోడ్డు తీయాలని ప్రతిపాదించారు. అయితే కొంతదూరంలో సుమారు 10 మందికి చెందిన సన్నకారు రైతుల భూముల పక్కకు ఉన్న హైటెన్షన్ లైన్ కింద కాకుండా వారి భూముల్లోంచి రోడ్డు జరపడం ఎందుకని బాధిత రైతులు ప్రశ్నిస్తున్నారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే సుమారు 10 మంది రైతులకు ఒక్కొక్కరికి 10 నుంచి 15 గుంటలు మాత్రమే భూమి ఉందని ఈ కొద్దిపాటి భూముల్లోనూ రోడ్డువేస్తే భూమిని మొత్తం కోల్పోవాల్సి వస్తుందని తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు చెబుతున్నారు. బుధవారం టౌన్‌ప్లానింగ్ అధికారులు బాధిత రైతుల భూముల్లో సర్వే చేయగా వారు అడ్డుకున్నారు. తమకు సమాచారం ఇవ్వకుండా తమతో సంప్రదించకుండా, నష్టపరిహారం తేల్చకుండా ఎలా సర్వే చేస్తారంటూ టౌన్‌ప్లానింగ్ అధికారులను నిలదీశారు

ప్రైవేట్ వెంచర్‌ల కోసమే రోడ్డా?

లింగాపూర్ గేటు నుంచి సబ్‌స్టేషన్ వరకు ప్రతిపాదించిన 100, 83 ఫీట్ల రహదారి ఏర్పాటు ప్రైవేట్ వెంచర్ల కోసమేనని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. సుమారు 6 కిలో మీటర్ల వరకు ఏర్పాటు చేయనున్న ఈ రహదారి వెంట 200 ఎకరాల్లో హైదరాబాద్, కామారెడ్డికి చెందిన పలు బడా వ్యాపారులు, రాజకీయ నేతల భూములు ఉన్నాయని రైతుల నుంచి వాదన వినిపిస్తోంది. ఈ భూములను హైదరాబాద్‌కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి డెవలప్‌మెంట్ చేస్తున్నాడని వారి వెంచర్ల కోసమే ఈ రహదారిని ఏర్పాటు చేస్తున్నారంటూ విమర్శలు వస్తున్నాయి. గతంలోనూ ఈ రహదారి ప్రతిపాదించినప్పటికీ రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసమే రోడ్డును నిర్మించేందుకు అనుమతులు తీసుకవచ్చారని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఇదే ప్రస్తుతం మరోసారి తెరమీదకు తీసుకురావడం కామారెడ్డిలో చర్చనీయాంశంగా మారింది. అయితే పెద్ద మొత్తంలో భూములు ఉన్న యజమానులు స్వచ్ఛందంగా భూమి ఇస్తున్నట్లు ప్రకటన చేయించడం బట్టి చూస్తే రియల్ వ్యాపారులు ఆ యజమానులతో సంప్రదింపులు జరిపారే తప్ప రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న చిన్న, సన్నకారు రైతులతో మాత్రం ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోలేదని బాధిత రైతులు చెబుతున్నారు. తమకు నష్టపరిహారం తేల్చాక సర్వే చేయాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కొందరు రైతులు సర్వే చేయనివ్వలేదు

- గిరిధర్, టీపీవో, కామారెడ్డి మున్సిపాలిటి

కామారెడ్డి పట్టణ శివారులో లింగాపూర్ నుంచి సబ్‌స్టేషన్ వరకు నిర్మించే వంద ఫీట్లు, 83 ఫీట్ల రహదారి పనులకు సంబంధించి రెండు రోజులుగా సర్వే చేపడుతున్నాం. సుమారు ఈ రోడ్డు 6 కిలోమీటర్ల వరకు వేయాల్సి ఉంటుంది. ఈ రోడ్డు నిర్మాణానికి కొందరు భూమి ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. అయితే 10 నుంచి 15 గుంటల వరకు ఉన్న చిన్న రైతులు తమకు సమాచారం ఇవ్వకుండా మా భూముల్లో సర్వే ఎలా చేస్తారని ప్రశ్నించారు. దీంతో వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేశాం. అయినప్పటికీ వారు స్పందించకపోవడంతో సర్వేను ఆపాల్సి వచ్చింది.

జిల్లా గ్రంథాలయాన్ని నెం.1గా నిలిపేందుకు కృషి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి



లింగంపేట గ్రంథాలయంలో మాట్లాడుతున్న చంద్రకాంత్‌రెడ్డి

లింగంపేట/తాడ్వాయి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా గ్రంథాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీల సహకారంతో రాష్ట్రంలో నెం.1గా ఉంచేందుకు కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. ఆయన బుధవారం లింగంపేట, తాడ్వాయి మండలాల్లోని శాఖా గ్రంథాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు కోసం చదువుకుని ఇటీవల ప్రకటించిన ఉద్యోగాల ఫలితాల్లో 320 మంది ఉద్యోగాలు సాధించారన్నారు. ఇప్పటికీ ప్రతీ రోజు 600 మంది విద్యార్థులు, నిరుద్యోగులు గ్రంథాలయానికి వచ్చి చదువుకుంటున్నారని ఆయన తెలియజేశారు. తాడ్వాయిలో గ్రంథాలయంలో ఉన్న సమస్యలను ఇన్‌చార్జి గ్రంథపాలకుడు రాజలింగం తమ దృష్టికి తీసుకువచ్చాడని త్వరలోనే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది మౌనిక, నాయకులు నర్సిరెడ్డి, రాజు పటేల్, కొడ రవీందర్, ఖాసీం, నగేష్, సుప్పాల రాజు, సాయికుమార్, సలీమ్‌లతో పాటు నాయకులు ఉన్నారు. తాడ్వాయిలో మండల అధికారి సయ్యద్ సాజిద్‌అలీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జూకంటి వెంకట్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణాచారి, గైని శివాజీ, మాజీ సర్పంచ్ సంజీవ్, మాజీ ఉప సర్పంచ్ సుధాకర్ రావు, గ్రామ అధ్యక్షుడు మెట్టు రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.



నసురుల్లాబాద్ వైన్స్‌ను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

వైన్స్‌ను తనిఖీ చేసిన ఎక్సైజ్ శాఖాధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నసురుల్లాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇష్టారీతిన కొనసాగుతున్న బెల్ట్ షాపులపై 'ఆంధ్రజ్యోతి' బుధవారం 'జోరుగా సిట్టింగ్‌లు' అనే కథనాన్ని ప్రచురించింది. ఈ కథనానికి ఎక్సైజ్ శాఖ అధికారులు వెంటనే స్పందించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ ఎస్సై తేజస్విని బొమ్మన్ దేవ్‌పల్లి ఎక్స్ వద్ద ఉన్న వైన్స్‌ను బుధవారం ఎక్సైజ్ అధికారులు వైన్స్‌ను తనిఖీ చేశారు. వైన్స్‌లో గల రికార్డులను పరిశీలించి, నిబంధనలను మేరకు మాత్రమే వైన్స్‌ను నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. కాగా మండలంలో బెల్ట్ షాపులలో మందు విక్రయిస్తున్న బెల్ట్‌షాపులపై త్వరలోనే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా బెల్ట్ షాపుల వద్ద సెట్టింగులు ఏర్పాటు చేసినా అక్రమంగా మద్యం విక్రయించినా వారిపై చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు పెడతామని ఆమె అన్నారు.

బిచ్కుందలో దొంగ నోట్ల కలకలం

- పోలీసుల అదుపులో దొంగనోట్లు చెలామణి చేసే వ్యక్తి
- సదరు వ్యక్తి నుంచి రూ.28లక్షల దొంగనోట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం
- లోతుగా విచారణ చేపడుతున్న పోలీసులు

కామారెడ్డి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ డివిజన్ పరిధిలోని బిచ్కుంద మండల కేంద్రంలో ఇటీవల ఓ కారులో వ్యక్తి నుంచి దొంగనోట్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ దొంగనోట్ల వ్యవహారంపై బాన్సువాడ పోలీసులతో పాటు సీసీఎస్ విభాగం అధికారులు లోతుగా విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి గత కొన్ని రోజులుగా దొంగ నోట్లను వేరే ప్రాంతాల్లో చెలామణి చేస్తున్నట్లు నిఘా వర్గాల ద్వారా పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందినట్లు తెలిసింది. అయితే సదరు వ్యక్తిపై సీసీఎస్ పోలీసులు గత కొన్ని రోజులుగా నిఘా పెట్టారు. ఈనెల 7న సీసీఎస్ పోలీసులు పక్కా సమాచారంతో సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. సదరు వ్యక్తి బిచ్కుంద మండలంలోని ఓ రైస్‌మిల్లు ఆవరణలో తన కారును పార్క్‌చేసి అందులో దొంగనోట్లను భద్రపరిచినట్లు పోలీసులు గుర్తించారు. సదరు వ్యక్తిని పోలీసులు విచారణ చేపట్టగా రైస్‌మిల్ ఆవరణలో పార్క్ చేసిన కారులో కాటన్ బాక్స్‌లలో సుమారు రూ.28లక్షల దొంగనోట్లను గుర్తించినట్లు తెలిసింది. అయితే ఈ దొంగనోట్ల వ్యవహారం సదరు వ్యక్తి ఎక్కడి నుంచి నడిపిస్తున్నాడు. ఎవరి వద్ద నుంచి తీసుకువచ్చాడు, ఎక్కడెక్కడ ఈ నోట్లను చెలామణి చేశాడనే దానిపై పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. అయితే సదరు వ్యక్తి వేరే రాష్ట్రం నుంచి ఈ నకిలీ నోట్లను తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఇతనికి ఎవరి సహకారం ఉంది, ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయనే దానిపై విచారణ చేపడుతున్నారు.

మద్నూర్‌లో గీతా జయంతి

మద్నూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం, జూనియర్ కళాశాలలో గీతాజయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కవి వెంకట్ మాట్లాడుతూ సమితి ఆధ్వర్యములో అనేకమైన ఆధ్యాత్మిక సాంస్కృతిక సాహిత్య సామాజిక కళా సేవా కార్యక్రమాలను నిర్వహించామని అన్నారు. భగవద్గీత సమస్యలను తొలగించే గొప్ప గ్రంథమని పేర్కొన్నారు. గీత పంచమవేదంగా పిలువబడిందని నేటి సమాజమును చైతన్యపరిచేది గీతనేనని తెలిపారు. ప్రపంచం చేత నమస్కరింపబడినదని అన్నారు. శ్రీకృష్ణభగవానుడు నాడు అర్జునునికి బోధించిన గీత నేడు మానవులకు ఉపయోగకారిణిగా, ఉత్తమ గ్రంథంగా ఉందని తెలిపారు. ప్రతీ భారతీయుడు తప్పక భగవద్గీత చదవాలని, మన జీవితమును పరివర్తనకు చేసుకోవాలని సూచించారు. సంస్కృత భారతి విద్యార్థులు ఆలపించిన గీతా శ్లోకాలు, సుభాషితాలు సభను అలరించాయి.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారులను పకడ్బందీగా సేకరించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల వివరాలు పకడ్బందీగా సేకరించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌లతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను ప్రారంభించామని తెలిపారు. ప్రజాపాలన ద్వారా సుమారు 80 లక్షల వరకు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు వచ్చాయని, ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా 80 లక్షల దరఖాస్తులకు సంబంధించి సంపూర్ణ వివరాలు డిసెంబరు నెలాఖరులోపు సేకరించాలని, ప్రతీ 500 ఇళ్ల దరఖాస్తుల సర్వే కోసం ఒక సర్వేయర్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయా స్థానిక సంస్థల్లో ఇందిరమ్మ కమిటీలు నియమించామని, వీరిని సమన్వయం చేసుకుంటూ వివరాల సేకరణ జరగాలని, షెడ్యూల్ ముందస్తుగానే ఇందిరమ్మ కమిటీల ద్వారా ప్రజలకు తెలపాలని అన్నారు. ప్రస్తుతం సేకరించే డాటా రాబోయే 4 సంవత్సరాలు ఉపయోగపడుతుందని, ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని వివరాల సేకరణ ఉండాలని తెలిపారు. పిల్లలకు అందించే డైట్ చార్జీలను 40 శాతం పెంచిందని, డైట్ చార్జీల పెంపు లాంచ్ కార్యక్రమంతో పాటు ఈ విద్యాసంస్థలను రెగ్యులర్‌గా తనిఖీ చేయాలని, ఈ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన ఆహారం అందే దిశగా కృషి చేయాలని తెలిపారు. హాస్టళ్లకు సన్నరకం బియ్యం సరఫరా చేస్తున్నామని ఇందులో అధికంగా నూకలు వస్తున్నాయని ఫిర్యాదులు ఉన్నాయని వీటిని పరిశీలించి కలెక్టర్‌లు నాణ్యమైన బియ్యం, విద్యా సంస్థలకు చేరేలా చూడాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధూశర్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఎస్పీ, అధికారులు

నిబంధనలు పాటిస్తూ పరీక్షలకు హాజరు కావాలి

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్ధేశించిన నిబంధనలను పాటిస్తూ అభ్యర్థులు ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలకు హాజరు కావాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబరు 15,16 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్నాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు సెషన్‌లలో గ్రూప్-2 పరీక్షలు జరుగుతాయని, అభ్యర్థులకు అవసరమైన మేర పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామని తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని 19 కేంద్రాల్లో 8,085 మంది అభ్యర్థులు గ్రూప్-2 పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం సెషన్‌లో 8.30 నుంచి మధ్యాహ్నం సెషన్‌లో 1.30 నుంచి అనుమతించడం జరుగుతుందని, పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు మూసి వేస్తామని, దీని తర్వాత పరీక్ష కేంద్రాలకు ఎవరిని అనుమతించడం జరగదని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు బ్లూ/బ్లాక్‌పాయింట్ పెన్నులు, ఫొటోతో కూడిన హాల్‌టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఒరిజినల్ ఫొటోతో కూడిన ఐడెంటిటీ ప్రూఫ్ తీసుకుని రావాలని, హాల్‌టికెట్‌పై పాస్‌ఫొటో సైజ్ ఫొటో ముద్రించి తీసుకునిరావాలని, ఒకే హాల్ టికెట్‌ను పరీక్ష మొత్తం వినియోగించాలని తెలిపారు. హాల్‌టికెట్ సరిగా లేకపోతే అభ్యర్థి 3 పాస్‌ఫొటో సైజ్ ఫొటోలు గెజిటెడ్ అధికారి లేదా చివర చదివిన విద్యాసంస్థ ప్రిన్సిపాల్ సంతకంతో తీసుకువచ్చి పరీక్ష హాల్‌లో ఇన్విజిలేటర్‌కు అప్పగించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు ఎలాంటి ఆభరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని, షూస్ వేసుకోవద్దని తెలిపారు. బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు పరీక్ష హాల్ విడిచి వెళ్లరాదని, బయోమెట్రిక్ ఇవ్వని అభ్యర్థుల ఓఎంఆర్ షీట్ వ్యాలిడ్ కాదని తెలిపారు. 190 మంది దివ్యాంగ అభ్యర్థులకు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వింగ్ ఏ, వింగ్ బీ గదులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్ష స్వయం గా రాయలేని వారికి 23 మంది సహాయకులుగా నియమించడం జరిగిందని తెలిపారు. అలాంటి అభ్యర్థులు సదరం సర్టిఫికెట్/అపెండిక్ 3 తప్పనిసరిగా చీఫ్ సూపరిటెండెంట్‌లకు చూపించాలని తెలిపారు.

'డబుల్ ' ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలి



రుద్రూరులో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కోటగిరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలో జవహర్‌నగర్, రాజీవ్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఎం నాయకులు నన్నేసాబ్ డిమాండ్ చేశారు. రుద్రూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో పేదలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లను నేటికి పంపిణీ చేయకపోవడం సరికాదన్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఈ సమస్యపై తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేయాలని డిప్యూటీ తహసీల్దార్ సురేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, భీమయ్య, గంగాధర్, అప్సర్ ఖాన్, సాయిలు, హన్మవ్వ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

నవీపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు తహసీల్దార్ వెంకట రమణకు వినతిపత్రం సమర్పించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు అందిస్తున్న భోజన స్లాబ్ రేటును పెంచి ఇవ్వాలని, ప్రతీనెల 5లోగా బిల్లులు చెల్లించాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నరేష్, శ్రీను, గంగామణి తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



మృతిచెందిన పెద్ద సాయిలు

నవీపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండలం కళ్యాపూర్‌కు చెందిన గుట్టమీది పెద్ద సాయిలు(61) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని ఎస్సై వినయ్ తెలిపారు. కళ్యాపూర్ గ్రామ పంచాయతీలో వాటర్‌మెన్‌గా పని చేసే పెద్ద సాయిలు ఈ నెల 5న పని కోసం తన లూనాపై నవీపేట వచ్చాడన్నారు. తన గ్రామానికి చెందిన డప్పు గంగాధర్ అనే వ్యక్తిని తన లూనా పై ఎక్కించుకుని మధ్యాహ్నం 4గంటల సమయంలో స్వగ్రామానికి వెళ్తుండగా మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల గేటు బయట నిలిపి ఉన్న బస్సును తన లూనా అదుపు తప్పి ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. వెంటనే బాధితులను 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని అన్నారు. మెరుగైన చికిత్స కోసం ఈ నెల 6న పెద్ద సాయిలును జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా 9వ తేదీన తిరిగి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించడం జరిగిందని, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య వీరాలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణా రెడ్డి

ఎడపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు సైబర్ నేరగాళ్ళ పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఎడపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం మండలంలోని రానాకలాన్ గ్రామానికి చెందిన వ్యక్తి తన క్రెడిట్ కార్డు డీ ఆక్టివేట్ కావడంతో గూగుల్‌లో వెతికి అఫీషియల్ మేయిల్ అనుకొని క్రెడిట్ కార్డు ఆక్టివేట్ కోసమని మెసేజ్ పంపగా వాళ్లు పంపిన లింక్ ద్వారా సైబర్ నేరగాళ్ల వలకు చిక్కి తన అకౌంట్ నుంచి 28వేల రూపాయలను పోగొట్టుకున్నానని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, మండల ప్రజలు ఆన్‌లైన్ ద్వారా ఎవరైనా తెలియని వ్యక్తులు మీ యొక్క క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాలు అడిగినా, ఓటీపీలు అడిగినా చెప్పవద్దని, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ఉప్లూర్‌లో భగవద్గీత పుస్తకాల వితరణ

కమ్మర్‌పల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్లూర్ గ్రామంలో బుధవారం జైశ్రీరాం గీతా జయంతిని పురస్కరించుకుని పెద్దాపూర్ ప్రభూజీ రాజేందర్ కాశన్న గ్రామస్థులకు భగవద్గీత పుస్తకాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా భగవద్గీత సందేశాన్నిచ్చారు. ప్రతీఒక్కరు భగవత్ సారాంసాన్ని తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమ్మర్‌పల్లి సొసైటీ చైర్మన్‌రేగుంట దేవేందర్, బద్దం చిన్నారెడ్డి, నల్ల మోహన్ రెడ్డి, మూల భూమన్న, బద్దం భాస్కర్, ఎనేడ్ల బాజిరెడ్డి, గోపిడి శంకర్, విడిసి అధ్యక్షుడు సోమ దశరథ్, పాలెపు మురళి, మాజీ ఎంపీటీసీ పిప్పెర అనీల్,సాంబారు కిషన్ బెజగం వెంకటేష్ గుప్త తదితర గ్రామస్థులు పాల్గొన్నారు.



గోరక్ష మహా పాదయాత్రను స్వాగతిస్తున్న అయ్యప్పస్వాములు

గోరక్ష మహా పాదయాత్రకు స్వాగతం పలికిన అయ్యప్పస్వాములు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో అఖిల భారత దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో బుధవారం గోరక్ష మహాపాదయాత్రను స్వాగతించారు. అఖిల భారత గోసేవ ఫౌండేషన్ బాలకృష్ణ గురుస్వామి కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 14రాష్ట్రాలను కలుపుకొని 4900 కిలోమీటర్లు 180 రోజుల్లో పాదయాత్ర చేయడం జరుగుతుందని, ప్రతీఒక్కరు గోమాతను రక్షించాలని, గోమత వల్ల కలిగే ప్రయోజనాలను బాలకృష్ణ గురుస్వామి వివరించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు నగేష్‌శర్మ, అయ్యప్పసేవా సమితి అధ్యక్షుడు పెంట జలందర్, దత్తు, జనార్ధన్‌గౌడ్, గోల్డ్ సురేష్, మీసాల రాజేశ్వర్, చేపూర్ ధనుంజయ్, అశోక్, గంగాధర్‌గౌడ్, గంగచరణ్, నందు, కిషన్ పాల్గొన్నారు.

మందిర నిర్మాణానికి విరాళం

ఎడపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన పెద్దమ్మ తల్లి మందిర నిర్మాణానికి బీజేపీ సీనియర్ నాయకులు కందగట్ల రాంచందర్ బుధవారం విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుర్నాపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి తనవంతు సాయంగా 20 వేల ఒక రూపాయలను విరాళంగా అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్, కుర్నాపల్లి గ్రామ ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు ఉన్నారు.

కుక్కల బెడద తీర్చండి

ఆర్మూర్ మున్సిపల్ సాధారణ సమావేశంలో నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి):కుక్కల బెడద తీర్చాలని పలువురు నిరసన తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధ వారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. 21ఏ జెండా అంశాలతో పాటు అధ్యక్షుల అనుమతితో ఇంకా 14 అంశాలను ఏజెండాలో చేర్చగా 34 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించి తీర్మానించారు. అలాగే పందుల సంచారం వల్ల ప్రజలకు ఆరోగ్యసమస్యలు ఎదురవుతున్న దృష్ట్యా డంపింగ్‌యార్డు వద్ద ఎకరం స్థలం కేటా యించడాన్ని సభ్యులందరూ తిరస్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, వైస్‌చైర్మన్ షేక్ మున్న, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

ఫ్లోర్‌లీడర్ నిరసన..

మున్సిపల్ పరిధిలో కుక్కల బెడదతో ప్రజలు తీవ్ర భయందోళనకు గురవుతున్నారని తక్షణమే కుక్కల బెడద తీర్చాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ జీవీ.నర్సింహరెడ్డి కౌన్సిల్ సమావేశంలో నేలపై కూర్చొని నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ ఆవరణలో ఆయన మాట్లాడుతూ పలు వార్డులలో ఒకే రోజు 15 మందికి కుక్కలు గాయపర్చడం, జిల్లా కలెక్టర్ స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలకు మున్సిపల్‌లో ఉన్న ప్రజలు పన్నులు కట్టిన వాటి నుంచి రూ.5లక్షలు కేటాయించడం దారుణమన్నారు. గత బీఆర్ఎస్ ఎమ్మెల్యే నిర్లక్ష్యంతో టీయుఎఫ్ఐడీసీ నిధులు ఖర్చు చేయకపోవడంతో ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది గడిచినా నిధులు కేటాయించకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. మున్సిపల్‌లో జరిగిన అవినీతి అక్రమాలపై గతంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సీఎంకు ఫిర్యాదు చేశాడని గుర్తుచేశారు. తక్షణమే విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట కౌన్సిలర్‌లు డి.సాయి కుమార్ ఆకుల సంగీత, పాలెపు లతలు ఉన్నారు.

మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్



వంట గదిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోడల్‌స్కూల్‌ను అడిషనల్ కలెక్టర్ అంకిత్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గది, గదిలో నిల్వ ఉంచిన సరుకులను, తాగునీటి ప్రాంతాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో వంటలు చేయాలని, నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అనంతరం వివిధ వార్డుల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ వెంట తహసీల్దార్ గజానంద్, ఎంపీడీవో సాయికుమార్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, నాగరాజు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని వండి వడ్డించాలని అదనపు కలెక్టర్ అంకిత్‌కుమార్ సూచించారు. బుధవారం జక్రాన్‌పల్లిలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలో ఆయన మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదిలో వండిన అన్నంను, కూరలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సతీష్‌కుమార్, ఎంఈవో శ్రీనివాస్, ఎంపీవో యుసుఫ్‌ఖాన్, కేజీబీవీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ సీఐ

బోధన్‌రూరల్,డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): కారు డ్రైవర్ అజాగ్రత్తగా కారును నడిపి ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టి ఒకరి ప్రాణాలను బలిగొన్న సంఘటన బుధవారం బోధన్‌లో చోటు చేసుకుంది. బోధన్ మండలం సాలూర క్యాంప్ గ్రామ శివారులో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో మహారాష్ట్రలోని కొండల్‌వాడి ప్రాంతానికి షేక్.మహబూబ్ (42) అనేవ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. దీనికి ముందు కొప్పర్తి క్యాంప్ క్రాస్ రోడ్డు వద్ద భూలక్ష్మి క్యాంప్ గ్రామానికి చెందిన మహేందర్ రెడ్డి అనే వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. ద్విచక్రవాహనాలను ఢీకొట్టిన కారు అదుపు తప్పి బోల్తా పడిందన్నారు. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఘటనా స్థలం వద్ద బాధిత కుటుంబసభ్యులు ఆందోళన నిర్వహించగా పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. బాధిత కుటుంబ సభ్యులకు భరోసా కల్పించి సముదాయించారు. అనంతరం ఘటనాస్థలాన్ని బోధన్ ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందిన మహబూబ్ మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

ముప్కాల్‌లో చోరీ

ముప్కాల్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో కట్ట మానస ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితులు అదే గ్రామంలో ఉన్న చెల్లె పెళ్ళి పనులు ముగించుకొని తిరిగి అర్ధరాత్రి ఒంటి గంటకు ఇంటికి వెళ్లారు. అప్పటికే ఇంటిలోపలి నుంచి గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు బయటకు రాగా పారిపోతున్న వారిని వెంబడించినా ఫలితం లేకుండా పోయింది. ఇంట్లోకి వెళ్ళి చూడగా దుస్తులతో సహా చిందరవందర పడి ఉన్నాయి. బీరువాలోని రూ.లక్షా 10వేల నగదు, ఐదు బంగారు ఉంగారాలు, కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రజనీకాంత్ తెలిపారు.

మహిళ అదృశ్యం

ముప్కాల్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన పుట్ట లక్ష్మీ అదృశ్యమైనట్టు ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ తెలిపారు. అక్టోబర్ 29న కూలిపనికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్ళిన ఆమె తిరిగి రాలేదు. తన బంధువుల ఇళ్ళలో వెతికిన ఆచూకీ దొరకలేదు. ఆమ్మె భర్త పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రజనీకాంత్ తెలిపారు.

మూడు షాపుల్లో చోరీ



మెడికల్ షాప్ చోరీ వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై గోవింద్

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండు మెడికల్ షాప్, ఒక స్కానింగ్ సెంటర్‌లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. బుధవారం వేకువజామున మహారాష్ట్రకు చెందిన టాటా ఏసీ వాహనంలో ఐదుగురు దొంగలు వచ్చి మహాలక్ష్మీకాలనీ వద్దగల దొండి మెడికల్ దుకాణం షెట్టర్‌ను లేపి అందులోకి ప్రవేశించి సుమారు రూ.3లక్షల నగదును, కేర్ మెడికల్‌లో రూ.30వేల నగదును, అలాగే సమీపంలోని ఓ స్కానింగ్ సెంటర్‌లో రూ.30వేల నగదు, టీవీని ఎత్తుకెళ్ళారు. విషయం తెలుసుకున్న ఎస్సై తిరునగిరి గోవింద్ పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పలుషాపుల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి వివరాలు సేకరించారు. దీంతో ప్రధాన రోడ్డుకు ఇరువైపుల ఉన్న షాప్‌లలో చోరీ జరిగిన సంఘటనను తెలుసుకున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి పరిశీలించి క్లూస్ టీం సభ్యులతో వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు11(ఆంధ్ర జ్యోతి): ఆర్మూర్ నియోజ కవర్గంలో ఇటీవల మంజూరైన ఎత్తిపోతల పథకం పనులకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని బుధవారం ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి కలిసి విన్నవించారు. నియోజకవర్గంలోని చిట్టాపూర్, పత్తేపూర్ ఎత్తిపోతలు, మచ్చర్ల లిఫ్ట్ ఇరిగేషన్, గుంజిలి ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

శబరిమలకు స్పెషల్ బస్సులు

పెర్కిట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ శబరిమాలకు స్పెషల్ సూపర్‌లగ్జరీ బస్సులను ప్రయాణ చార్జీలు తగ్గించి అందుబాటులోకి ఉంచనున్నదని ఆర్మూర్ డిపోమేనేజర్ రవికుమార్ తెలిపారు. అయ్య ప్పస్వాములు , యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సీఎం కప్ టోర్నీ ప్రారంభం



నవీపేటలో సీఎం కప్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు

నవీపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బుధవారం సీఎం కప్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల ఆవరణలో జరిగిన టోర్నమెంట్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాల, బాలికలు, యువతి, యువకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, నాయబ్ తహసీల్దార్ రావు, ఎంఈవో అశోక్, ఏఎస్ఐ గఫర్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు మీడియం క్రీడా మైదానంలో మండలస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను బుధవారం మండల అభివృద్ధి అధికారి శంకర్, మండల విద్యాశాఖ అధికారి సాయిలు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ పోటీలలో ఎడపల్లి, ఏఆర్పీ క్యాంపు గ్రామ యువకులు, విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల పంచాయితీ అధికారి మన్మోహన్ శర్మ, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడల్లో వివిధ గ్రామాల పాఠశాలలకు చెందిన క్రీడాకరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు శాంతికుమార్, నర్సయ్య కాందేష్ సంధ్య, గంగజమున క్రీడాకారులు పాల్గొన్నారు.

మోర్తాడ్ : మండల ప్రభుత్వ పాఠశాల మైదానంలో సీఎం కప్ క్రీడలు మంగళ, బుధవారాల్లో జరిగాయి. బుధవారం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో తిరుమలదేవి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పుప్పాల అశోక్, తక్కురి సతీష్, గంగాధర్, ప్రధానోపాధ్యాయులు మోహినోద్దిన్, సంతోష్, ఫిజికల్ డైరెక్టర్ శ్యామ్, వ్యాయమ ఉపాధ్యాయురాలు సింధూజ పాల్గొన్నారు.

వేల్పూర్: కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. బుధవారం పడిగెల, అక్లూర్ గ్రామాలకు చెందిన క్రీడాకారులు వాలీబాల్ పోటీలలో ఉత్కంఠగా కొనసాగాయి. అంతకు ముందు మండల స్పెషల్ ఆఫీసర్ దుర్గాభారతి, ఎంపీడీవో బాల కిషన్‌లు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

నందిపేట: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఆవరణలో రెండు రోజుల పాటు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సీఎం కప్ ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ పోటీల విన్నర్స్‌గా బాలుర విభాగంలో వెల్మల్ జట్టు, రన్నర్స్‌గా ఐలాపూర్ జట్టు, బాలికల విభాగంలో విన్నర్‌గా నందిపేట జట్టు, రన్నర్స్‌గా వెల్మల్ జట్టు, ఖోఖో పోటీల్లో బాలుర విభాగంలో విన్నర్స్‌గా నందిపేట జట్టు, రన్నర్స్‌గా బాద్గుణ జట్టు, బాలికల విభాగంలో విన్నర్స్‌గా నందిపేట జట్టు రన్నర్స్‌గా వెల్మల్ జట్టు నిలిచాయి.

మోర్తాడ్: కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో తిరుమలదేవి అధ్యక్షత వహించారు. ఈ పోటీల్లో కబడ్డీ మహిళ విభాగంలో ప్రథమ విజేతగా, తిమ్మాపూర్ ద్వితీయ స్థానంలో నిలిచింది. పురుషుల విభాగంలో శెట్‌పల్లి ప్రథమ స్థానంలో నిలవగా, తిమ్మాపూర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది.

డొంకేశ్వర్: క్రీడల్లో క్రీడాకారులు నైపుణ్యం ప్రదర్శించాలని ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో రామకృష్ణ అన్నారు. బుధవారం డొంకేశ్వర్‌లో మండలస్థాయి సీఎం కప్ పోటీ లను మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల ఆవరణలో వాలీబాల్ క్రీడలను ప్రారం భించారు.

జక్రాన్‌పల్లి: క్రీడల్లో గెలుపు ఓటమిలు సహజమని, ఓడిన జట్టు భవిష్యత్‌లో జరిగే క్రీడల్లో పాల్గొని గెలుపు కోసం కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి ప్రవీన్ అన్నారు. మండల ప్రత్యేక అధికారి ప్రవీన్ హాజరై మాట్లాడారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ



చందూర్‌లో క్రీడలను ప్రారంభిస్తున్న దృశ్యం

మోస్రా, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలో బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ ఆటల పోటీలను ఎంపీడీవో నీలావతి ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నీలావతి, మాజీ ఎంపీపీ లావణ్య, దశాగౌడ్, మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పొతంగల్‌లో కొత్త రేషన్ కార్డుల కోసం ధర్నా



పొతంగల్‌లో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కోటగిరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయకపోవడంపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పొతంగల్ మండల కేంద్రంలో బుధవారం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు భజరంగ్ మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం రేషన్ కార్డుల జారీలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రేషన్ కార్డులలో పేర్లు తొలగించడంలో ఉన్న శ్రద్ధ కొత్త రేషన్ కార్డులు ఇవ్వడంలో లేదన్నారు. ప్రభుత్వం మార్పులు, చేర్పులకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కిరణ్, అశోక్, హన్మాండ్లు, సయ్యద్, తుకారాం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

కోటగిరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను బుధవారం ఎంఈవో శ్రీనివాస్ రావు పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కస్తూర్బా ఇన్‌చార్జి సవిత రాణి తదితరులున్నారు.

సుద్దులంలో ఉచిత గర్భకోశ చికిత్సా శిబిరం



సుద్దులంలో దూడలకు నట్టల నివారణ మందులు వేస్తున్న సిబ్బంది

కోటగిరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దులం గ్రామంలో బుధవారం ఉచిత గర్భకోశ చికిత్స, దూడల ప్రదర్శన, పాల పోటీలను నిర్వహించారు. కార్యక్రమాన్ని కోటగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు ప్రారంభించారు. శిబిరంలో 26 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, రెండు పశువులకు కృత్రిమ గర్భధారణ, నాలుగు పశువులకు సాధారణ చికిత్సలు, 24 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న గర్భకోశ చికిత్స శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాలను ప్రదర్శించిన రైతులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ మజీర్ హైమద్, పశువైద్యాధికారి సురేష్ కుమార్, సంతోష్, మాజీ సర్పంచ్ సాయిలు, పశువైద్య సిబ్బంది మంజుల, సుధీర్ గౌడ్, గోపాలమిత్రులు రాము, నగేష్, రియాజ్, సాయిలు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదుల నిర్మాణ పనులు ప్రారంభం



ఏర్గట్లలో పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పలు సంఘ భవనాలకు ఎస్‌డీఎఫ్ ద్వారా ఆరు లక్షల నిధులు మంజూరు కాగా బుధవారం మండలంలోని కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముదిరాజ్ బర్మ పెద్ద సంఘంలో అదనపు గదులకు రూ.4 లక్షలు, శ్రీకృష్ణ యాదవ సంఘంలో రూ.2లక్షలు బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ మంజూరు చేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బద్దం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, ముస్కు మోహన్, గడ్డం జీవన్, దండెవోయిన సాయి, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురికావద్దు

● ట్రాన్స్‌కో డీఈ ముక్తార్ హైమద్

బోధన్‌రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంట పొలాల వద్ద విద్యుత్ ప్రమాదాలకు గురి కావద్దని బోధన్ ట్రాన్స్‌కో డీఈ ముక్త్యార్ హైమద్ అన్నారు. బుధవారం బోధన్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచన్‌పల్లిలోని పంట పొలాల్లో రైతులతో మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనం అవుతున్నాయని గుర్తు తెలియని వ్యక్తులు తమ పంట పొలాల వైపు వస్తే పోలీసులకు, తమ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పంట పొలాల్లో ఒక వైపు వంగిపోయిన విద్యుత్ స్తంభాలను సరి చేయడం జరిగిందన్నారు. విద్యుత్ సమస్యలు వస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏడీఈ నాగేష్ కుమార్, బోధన్ టౌన్-1 ఏఈ నాయిని కృష్ణ, విద్యుత్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పొలంబాటలో రైతులతో విద్యుత్ అధికారులు

టీయూలో ఇంటర్ కాలేజ్
అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం



టీయూలో ఇంటర్ కాలేజ్ అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఇంటర్ కాలేజ్ అథ్లెటిక్స్ మెన్స్, ఉమెన్స్ చాంపియన్ షిప్ 2024 పోటీలు బుధవారం ప్రారంభించినట్లు స్పోర్ట్స్ డైరెక్టర్ డా.బాలకిషన్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 12 కళాశాలలో 150 మంది క్రీడాకారులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నిబంధనల ప్రకారం సెలక్షన్స్ చేస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఒడిశాలోని ఓ యూనివర్సిటీలో ఈ నెల 26నుంచి 30వరకు క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. టోర్నమెంట్ నిర్వహణకు అనుమతులు ఇచ్చిన వీసీ, రిజిస్ట్రార్‌లకు బాలకిషన్ ధన్యవాదాలు తెలిపారు. ఎంపికలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ డా.బీఆర్ నేత, ఫిజికల్ డైరెక్టర్ బాలమణి, అంజలి, అనిల్‌కుమార్, పాల్గొన్నారు.

బేస్‌బాల్ క్రీడాకారులు
రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలి



జిల్లా బేస్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వీరే

డిచ్‌పల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా సీనియర్ పురుషుల బేస్‌బాల్ జట్టు ఎంపిక ఆర్మూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం జరగగా ఎంపికైన క్రీడాకారులు జట్టు సభ్యులు సత్తా చాటాలని బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మధు సూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వినోద్‌లు తెలిపారు. ఎంపికైన వారు జిల్లా జట్టును రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలబెట్టాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 13 నుంచి 15 వరకు మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో రాష్ట్ర బేస్‌బాల్ పోటీల్లో పాల్గొం టారని వారు తెలిపారు. ఈ ఎంపికల్లో జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు సంజీవ్, కోచ్ నరేశ్, పాల్గొన్నారు.

కష్టపడి గెలుపు కోసం కృషి చేయాలి

▸▸ ఎంపీడీవో లక్ష్మారెడ్డి



బహుమతులు అందుకున్న క్రీడాకారులు

ఇందల్వాయి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ఓడిన వారు నిరాశ చెందకుండా కష్టపడి గెలుపుకోసం కృషి చేయాలని ఎంపీడీవో లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని ఇందల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ 2024 క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీలలో 14 టీమ్‌లు పాల్గొనగా ఖోఖో బాలుర విభాగంలో ఇందల్వాయి మొదటి విజేతగా, గండి తండా రెండో విజేతగా, బాలికల విభాగంలో మొదటి విజేత నల్లవెల్లి, ఎల్లారెడ్డిపల్లి రెండవ విజేతగా గెలుపొందారు. కబడ్డీ బాలుర విభాగంలో మొదటి విజేత మేగ్యానాయక్ తండా, నల్లవెల్లి రెండవ విజేతగా గెలుపొందగా బాలికల విభాగంలో మొదటి విజేత తిర్మన్‌పల్లి, రెండో విజేత ఇందల్వాయి గెలుపొందారు. ఖోఖో బాలుర విభాగంలో మొదటి విజేత గన్నారం, రెండో విజేత మేగ్యానాయక్ తండా గెలుపొందగా బాలికల విభాగంలో మొదటి విజేత గన్నారం, రెండో విజేత మేగ్యానాయక్ తండా గెలుపొందారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మారెడ్డి, తహశీల్దార్ వెంకట్రావు, ఎంఈవో శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, సొసైటీ చైర్మన్‌లు శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కొరట్‌పల్లి ఆనంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేధిస్తున్న సర్వేయర్ల కొరత



ఎల్లారెడ్డి తహసీల్దార్ కార్యాలయం

- పల్లెల్లో గట్టు పంచాయతీలు ● పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న భూ యజమానులు ● భూమి ధరలు పెరగడమే కారణం

ఎల్లారెడ్డి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సర్వేయర్లు లేక భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు. భూముల కొలతలు సమయానికి కొలవకపోవడంతో గట్టు పంచాయతీలు ఎక్కువయ్యాయి. భూమి కొలతల కోసం రైతులు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసు కుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మండల సర్వేయర్లు సమయానికి సర్వే చేయ లేకపోవడంతో భూముల వద్ద గట్టు పంచాయతీలు నడుస్తున్నాయి. ఓ రైతు భూమి సర్వే కోసం జిల్లా సర్వేయర్ వద్ద ఫిబ్రవరి నెలలో డీడీ తీసి దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు కొలవలేదు. శాశ్వత సర్వేయర్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు, మూడేళ్లుగా ఇన్‌చార్జి సర్వేయర్లు కొనసాగుతుండటంతో కొలతలు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలోని 22 మండలాలు 526 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో 5,14,290 ఎకరాల వ్యవసాయ భూమి 3,16,650 రైతులు ఉన్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నాయి. వ్యవసాయ ఆధారిత జిల్లా కావడంతో ఇక్కడ భూముల ధర అమాంతం పెరిగాయి. దీంతో ఎకరం భూమి రూ.30 నుంచి 80 లక్షల వరకు పలుకు తోంది.

● **ఇన్‌చార్జి సర్వేయర్లతో ఇబ్బందులు**

మండల సర్వేయర్లు వారి మండలాలకు విధులు నిర్వహిస్తూ అదనంగా పక్క మండలాల అదనపు బాధ్యతలు కూడా అప్పగిస్తున్నారు. ఇన్‌చార్జి సర్వేయర్లతో రైతులు, భూ కొలతలు కాక ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది రైతులు ప్రైవేట్ సర్వేయర్‌తో వేల రూపాయలు ఖర్చు పెట్టి కొలతలు చేసుకుంటున్నారు. ఒక్కో రైతు మీ సేవలో చాలాసార్లు దరఖాస్తు చేసుకున్న భూమి కొలిచే నాథుడు లేకపోవడంతో గట్టు పంచాయతీలు పెరుగుతున్నాయి. గుంట, అరగుంట కోసం రైతులు గొడవలు పెట్టుకుంటున్నారు.

● **పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కుతున్న రైతులు**

సర్వేయర్ లేకపోవడంతో రైతులు మధ్య గొడవలు పెరిగి పోలీస్ స్టేషన్ వరకు చేరుతున్నాయి. దీంతో భూముల పంచాయితీ పోలీసులకు తలనొప్పిగా మారింది. ఒక్కోసారి రెండు నుంచి మూడు మండలాల బాధ్యతలు ఉండటంతో పాటు కొలతలు అప్పగిస్తుండటంతో వారికి పని భారం ఎక్కువైంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలాలకు శాశ్వత సర్వేయర్లను నియమించాలని రైతులు కోరుతున్నారు.

● **అధికారులు స్పందించాలి..**

శాశ్వత సర్వేయర్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. భూ సమస్యను పెండింగ్‌లో ఉంటున్నాయి. ఒక్కో సర్వేయర్‌కు రెండు మండలాల బాధ్యతలు ఉండటంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శాశ్వత సర్వేయర్లను నియమించి రైతుల సమస్యలు తీర్చాలి.

● సాయిలు, రైతు

● **సర్వే జరగక చెక్ డ్యాం నిర్మాణంలో భూమి కోల్పోయా..**

ఎల్లారెడ్డి మండలంలోని అడవి లింగాల శివారులో 326 సర్వే నంబర్‌లో నాకు 3.01 ఎకరాల భూమి ఉంది. మా భూమి పక్కన ఉన్న కళ్యాణి వాగుపై చెక్ డ్యాం నిర్మాణం వల్ల తమ భూమి కోల్పో తున్నామని అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో భూమి సర్వే కోసం ఫిబ్రవరి 24న జిల్లా సర్వేయర్ కార్యాలయంలో డీడీ కట్టి దరఖాస్తు చేశాను. ఎన్నిసార్లు కార్యాలయం చుట్టు తిరిగినా అధికారులు స్పందించ లేదు. సర్వే నిర్వహించలేదు. చెక్ డ్యాం నిర్మించడం వల్ల సర్వేయర్లు సమయానికి రాకపోవడంతో నా పట్టా భూమి సుమారు 15 గుంటల భూమి కోల్పోయాను. అధికారులు స్పందించి సర్వే నిర్వహించి తగిన న్యాయం చేయాలని కోరుతున్నా.

● పి .సావిత్రి, రైతు

● **ప్రైవేటు సర్వేయర్లను ఆశ్రయిస్తున్న రైతులు**

రైతులు తమ భూమి సర్వే కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న సర్వేయర్లు రావడం ఆలస్యం కావడంతో ప్రైవేట్ సర్వేయర్లను ఆశ్రయిస్తున్నారు. అయితే ప్రభుత్వ సర్వేకు ప్రైవేట్ సర్వేస్ పొంతన కుదరకపోవడంతో ఇరువర్గాల మధ్య వివాదాలు తలెత్తే అవకాశాలు లేకపోలేదు. ఇలాంటి సంఘటనలు ఆయా మండలాల్లో జరిగాయని పలువురు రైతులు తెలిపారు. రైతులు భూ సర్వేకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోగా ఓ మండలానికి చెందిన సర్వేయర్ ఆన్‌లైన్ దరఖాస్తులను రిజెక్ట్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా ప్రైవేట్ సర్వేయర్లు చేసిన సర్వే పంచనామాలను ఓ సర్వేయర్ అధికారికంగా సర్టిపై చేసి ఇస్తున్నట్లు అధికారిక వర్గాల్లోనే చర్చ జరుగుతోంది. ప్రభుత్వం సర్వేయర్ల కొరత తీర్చి భూ సమస్యలకు పరిష్కారం చూపాలని, అలాగే తప్పుడు నివేదికలు ఇచ్చే సర్వేయర్లపై చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.



పూజలు చేస్తున్న అర్చకులు

శక్తిమాన్ హనుమాన్ మందిర
నిర్మాణానికి భూమిపూజ

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ కాలనీలో నూతనంగా నిర్మించతలపెట్టిన శక్తిమాన్ హనుమాన్ మందిర నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. 12 అడుగుల ఎత్తుగల ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు నిర్వహించిన భూమిపూజలో గణపతి, గౌరీ, పుణ్యహవచన పూజలు నిర్వహించి భూమిని సంప్రోక్షణ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఆర్టీసీ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నాలుగు నెలల్లో ఆలయాన్ని నిర్మించి వసంత పంచమి పర్వదినాన విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు.

టీయూలో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎంలో తక్షణ ప్రవేశాలు

డిచ్‌పల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాలలో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు తక్షణ ప్రవేశాలు 17 డిసెంబరు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు భర్తీ చేస్తారని అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.సంపత్ కుమార్ తెలిపారు. న్యాయ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించనున్నామని తెలిపారు. ఈ స్పాట్ అడ్మిషన్‌లో పాల్గొనే అభ్యర్థులు తప్పనిసరిగా టీజీ లాసెట్ 2024, టీజీ పీజీ లాసెట్ ఎంట్రెన్స్ లో ఉత్తీర్ణత పొందిఉండాలని ఈ ప్రవేశాలు స్టేట్ ర్యాంక్ ఆధారంగా నిర్వహిస్తామన్నారు. ప్రవేశాలకు హాజరయ్యే వారు ఒరిజినల్ సర్టిఫికేట్లతో రావాలని, తక్షణ ప్రవేశం పొందిన వారు ఫీజు రీయింబర్స్‌మెంట్ హాస్టల్ వసతి కల్పించనున్నామన్నారు. ఎల్‌ఎల్‌బీ-14, ఎల్‌ఎల్‌ఎం-1 సీటు ఖాళీగా ఉన్నాయని పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

▸▸ మూడు రోజుల పాటు ఉత్సవాలు ▸▸ 15న స్వామి వారి కల్యాణం, రథోత్సవం



ఆలయంలోని స్వామి మూల విరాట్టు



ఏర్గట్లలోని లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం

ఏర్గట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పురాతన దేవాలయమైన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబై మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఈ నెల 13 నుంచి 15 వరకు గ్రామాభివృద్ధి కమిటీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరగనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంకాలం పుణ్యహవచనం, అంకురార్పణం, రక్షాబంధనం, కుల దేవత స్థాపన బ్రహ్మకలశ స్థాపన నిర్వహించనున్నారు. శనివారం ఉదయం పంచోపనిషత్ పారాయణ, పంచామృత అభిషేకం, కర్మణ పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం, గరుడ కల్యాణం, ఆలయ బలిహరణ, తీర్థ ప్రసాద వితరణ జరగనున్నాయి. ఆదివారం స్వామి వారి పల్లకీ సేవ, స్వామి వారి కల్యాణ మహోత్సవం, అన్నదానం, సాయంత్రం 6.30 నిమిషాలకు రథోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహునికి నిత్య పూజలు జరగడంతో పాటు దూర ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి వచ్చి మొక్కులు తీర్చుకుంటారని, యజ్ఞాచార్యులు చక్రపాణి నరసింహ మూర్తి, ఆస్థాన అర్చకులు దయాత్రి కూచయ్యచార్యులు ఆధ్వర్యంలో జరగనున్న బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ముగిసిన గజ్జెలమ్మ జాతర

వర్ని, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తగిలేపల్లి గ్రామంలో బుధవారం గజ్జెలమ్మ ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. గ్రామానికి చెందిన గంప బాగాగౌడ్ ఇంటి నుంచి కల్లు ఘటం మొదలైన ఉత్సవాలు గజ్జెలమ్మ ఆలయం వరకు కొనసాగాయి. అనంతరం ఆలయం వద్ద గ్రామ పెద్దల సమక్షంలో తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయం ప్రకారం గజ్జెలమ్మ ఆలయం చుట్టూ రథాన్ని ఐదుసార్లు ప్రదక్షిణలు చేయించారు. ఉత్సవాలను తిలకించేందుకు ఉమ్మడి జిల్లాతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు.

ప్రమాదకరంగా మూల మలుపులు



హెచ్చరిక బోర్డు లేక ప్రమాదకరంగా మారిన మూల మలుపు



మూల మలుపు వద్ద కంప చెట్లు

- తరచూ రోడ్డు ప్రమాదాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ఏర్గట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుల మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఏర్గట్ల, బట్టాపూర్ తడపాకల్‌కు వెళ్లే దారిలో మూల మలుపుల వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదకర మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. క్షతగాత్రులు తమ సమస్యను ఎవరికి చెప్పుకోలేక ఆస్పత్రుల్లో చేరి ఆర్థికంగా నష్టపోతున్నారు. మూల మలుపుల వద్ద రోడ్లకు ఇరువైపులా కంప చెట్లు పెరగడంతో ప్రమాదాలు అనివార్యమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. తాళ్ల రాంపూర్ నుంచి తడపాకల్ వెళ్లే దారిలో రోడ్డు ఎత్తుగా ఉండడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొనే ప్రమాదం ఉంది. మండల కేంద్రంలో మెట్‌పల్లి వెళ్లే దారిలో రెండు చోట్ల ప్రమాదకర మలుపు కంప చెట్లు పెరిగి ప్రయాణిలకు ఇబ్బందిగా మారింది. అంతేకాకుండా మండల కేంద్రం నుంచి బట్టాపూర్ వెళ్లే దారిలో మూలమలుపులు, కంప చెట్లతో నిండిపోయాయి. అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద కంప చెట్లు తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గీతా జయంతి

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మానవాళికి దిశ నిర్దేశం చేసి శ్రీకృష్ణుని అనుగ్రహాన్ని పొందుపర్చిన భగవద్గీత జయంతి ఉత్సవాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణ ఆలయాలతో పాటు ఆధ్యాత్మిక, ధార్మిక సేవా సంస్థల ఆధ్వర్యంలో గీతా జయంతిని పురస్కరించుకొని భగవద్గీతకు, శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో విద్యార్థులకు భగవద్గీత పోటీలను నిర్వహించారు. నగరంలోని శివాజీనగర్‌లోని శ్రీకృష్ణ గీతా మందిరంలో విద్యార్థులకు భగవద్గీత పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

గీతాభవన్‌లో..

నగరంలోని రైల్వేస్టేషన్‌లోగల గీతా మందిరంలో గీతా జయంతిని పురస్కరించుకొని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగవద్గీత గ్రంథానికి పూజలు నిర్వహించి భగవద్గీతలోని శ్లోకాలను పఠించారు. ఈ సందర్భంగా గీతాభవన్ అధ్యక్షుడు నర్సింహాచార్యులు మాట్లాడుతూ భగవద్గీత గ్రంథం ఉపనిషత్తులు ఇతిహాస గ్రంథాలయాల సమాహారమని అన్నారు. ప్రతీరోజు భగవద్గీతను పఠించడం వల్ల ఎన్నో గొప్ప విషయాలు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రావు షిండే, మేడిచర్ల ప్రభాకర్, యోగారాంచందర్, లక్ష్మీనారాయణ, వెంకటస్వామి, దయానంద్, చంద్రశేఖర్, ప్రభుదాస్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



వేల్పూర్‌లో కూలిపోయిన డివైడర్

కూలిన డివైడర్

▸▸ మరమ్మతులు ఎప్పుడో..!?

వేల్పూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ భీమ్‌గల్ వెళ్లే ప్రధాన రహదారి వేల్పూర్‌లోని పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డు డివైడర్ రెండు చోట్ల కూలిపోయింది. గతంలో భారీ వర్షాలకు వరదనీరు ఉధృతికి డివైడర్ రెండు చోట్ల ధ్వంసమై సంవత్సరం గడుస్తున్నా అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో ధ్వంసమైన డివైడర్‌కు మరమ్మతులు చేపట్టక పోవడం వల్ల పశువులు అవలీలగా రోడ్డు దాటుతుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఇకనైనా సంబంధిత అధికారులు కూలిపోయిన డివైడర్‌కు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన సీఎం కప్ పోటీలు

సదాశివనగర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ మండల స్థాయి కోకో విజేతగా అడ్లూర్ ఎల్లారెడ్డి జట్టు నిలిచిందని ఎంపీడీవో సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ జట్టు ఈనెల 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో జరిగే కోకో పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

రాజంపేట: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం అని ఎంఈవో పూర్ణచందర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మీద గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం సీఎం కప్ మండల క్రీడ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. రాజంపేటకు చెందిన వారు కోకో క్రీడకు మొదటిబహుమతిగా, రెండో బహుమతిగా తలమడ్ల, కబడ్డీ మొదటి బహుమతి బస్వన్నపల్లి, రెండో బహుమతి ఆర్గొండ, వాలీబాల్ మొదటి బహుమతి అన్నారం తండా, రెండో బహుమతి తలమడ్లకి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, ఎస్‌ఐ పుష్పరాజ్, ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: రెవెన్యూ డివిజన్ స్థాయి సీఎం కప్‌కు తెలంగాణ గురుకుల విద్యాలయం జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నందాల గంగా కిషోర్ చెప్పారు. 10, 11వ తేదీల్లో మద్నూర్‌లోని మండల ప్రజా పరిషత్తు, తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం, జూనియర్ కళాశాలలో మద్నూర్ మండల స్థాయిలో జరిగిన భజన, వివిధ క్రీడల్లో విద్యార్థులు ప్రతిభను కనబరిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పద్య కవి, వ్యాఖ్యత బి.వెంకట్, సహాయ ప్రిన్సిపాల్ సుమన్, సంతోష్, ఆయా పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో మంగళవారం ప్రారంభమైన సీఎం కప్ పోటీలు బుధవారం ముగిసాయి. ఆట పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం అధికారులు, నాయకులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాధవరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం శ్యామల, నాయకులు విఠల్, మజీద్, ప్రతాప్, విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారులు మొదటి బహుమతి సాధించారని అధికారులు తెలిపారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు వీటిలో విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: చదువుతో పాటు విద్యార్థులు క్రీడాలపై దృష్టి సారించాలని తహసీల్దార్ నరేందర్ అన్నారు. సీఎం కప్ పోటీలను లింగంపేట బాలుర పాఠశాలలో నిర్వహించారు. దీనికి తహసీల్దార్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారుల వివరాలు ఇలా ఉన్నాయి. వాలీబాల్‌లో విన్నర్‌గా మోతె, రన్నర్‌గా లింగంపేట, కబడ్డీ విన్నర్ రాంపల్లి, రన్నర్ మాలోత్ తండా, కోకో విన్నర్ లింగంపేట, రన్నర్ భవానిపేటలు గెలుపొందాయి. విజేతలకు బహుమతులను అందజేశారు. మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, ఎంపీవో మాలహరి, పీడీ మహేందర్, వాహీద్ సిద్దీఖీలు ఉన్నారు.


భిక్కనూరులో గెలుపొందిన క్రీడాకారులు

భిక్కనూరు: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా సీఎం కప్ మండల స్థాయి క్రీడలు రసవత్తరంగా కొనసాగాయి. సీఎం కప్‌లో భాగంగా బుధవారం నిర్వహించిన వాలీబాల్ బాలుర విభాగం మొదటి స్థానంలో జంగంపల్లి, ద్వితీయ స్థానంలో కాచాపూర్, బాలికల స్థానంలో మొదటి స్థానం తిప్పాపూర్, ద్వితీయ స్థానం జంగంపల్లి, కబడ్డీ సీనియర్ విభాగంలో మొదటి స్థానం జంగంపల్లి, ద్వితీయస్థానం భిక్కనూరు, బాలికల విభాగంలో మొదటి స్థానం జంగంపల్లి, ద్వితీయస్థానం భిక్కనూరు నిలిచారు. ఈ సందర్భంగా ఎంఈవో రాజ్‌గంగారెడ్డి మాట్లాడుతూ మండలస్థాయిలో గెలుపొందిన జట్లు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.


మద్నూర్‌లో..


లింగంపేటలో..


సదాశివనగర్‌లో..


తాడ్వాయిలో..

ఘనంగా గీతాజయంతి ఉత్సవాలు


జెండా ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

సదాశివనగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపల్లి శ్రీకృష్ణమందిరంలో గీతాజయంతి ఉత్సవాలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహానుభావులు మహంత్ శ్రీమచాలే బాబా ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించారు. స్వామి వారిని రతంపై నిలిపి గ్రామంలోని వీధుల గుండా భజనకీర్తనలతో ఊరేగింపు నిర్వహించగా మహిళలు కలశాలను అందంగా ముస్తాబు చేసుకుని డప్పు వాయిద్యాలతో ఆలయానికి తీసుకువచ్చి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పీఠాధిపతులు విశిష్ట ఆహ్వానితులు భగవద్గీత ప్రవచనాలను భక్తులకు బోధించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

బీర్కూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చించోల్లి గ్రామంలో బుధవారం జరప తలపెట్టిన బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. నసురుల్లాబాద్ మండలం మిర్జాపూర్ గ్రామానికి చెందిన 15 సంవత్సరాల 5నెలల వయసు గల బాలికకు బీర్కూర్ మండలం చించోల్లి గ్రామానికి చెందిన అశోక్(22) అనే యువకుడితో వివాహం జరిపించేందుకు బాలిక, యువకుడి తల్లిదండ్రులు నిశ్చయించారు. అయితే స్థానికులు మంగళవారం రాత్రి 100, 1098 నెంబర్లకు ఫోన్ చేసి బాల్య వివాహం గురించి సమాచారం ఇచ్చారు. బుధవారం చించోల్లి గ్రామంలో యువకుడి ఇంటి దగ్గర వివాహ ఏర్పాట్లు జరుగుతుండగా జిల్లా బాలల పరిరక్షణ అధికారులు, రెవెన్యూ, పోలీస్, ఐసీడీఎస్ అధికారులు వివాహ వేదిక వద్దకు చేరుకున్నారు. బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. బాలిక, యువకుడి తల్లిదండ్రులకు అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఒకవేళ రహస్యంగా వివాహం చేయడానికి ప్రయత్నిస్తే పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని అధికారులు తల్లిదండ్రులను హెచ్చరించారు. అనంతరం బాలికను కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బాలికల సంక్షేమ కార్యాలయానికి అధికారులు తరలించారు.

ఇద్దరిపై కేసు నమోదు

గాంధారి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గాంధారి మండలం నేరల్‌తండా గ్రామంలో గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. నేరల్ తండా గ్రామ శివారులో గల బామన్ సజ్జు అనే వ్యక్తి ఇంటి దగ్గర నిఘా ఉంచగా బస్సి ప్రకాష్ అనే వ్యక్తి వచ్చి డబ్బులు ఇచ్చి రెండు గంజాయి ప్యాకెట్లు తీసుకుని వెళ్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 105 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయిని బామన్ సజ్జు తన ఇంటిముందు గల ఖాళీ ప్రదేశంలో గంజాయి మొక్కలు పెంచి దాని చుట్టు ఎవరికి అనుమానం రాకుండా కట్టెలతో కప్పిపెట్టి అది ఎండిన తర్వాత దానికి అదే గ్రామానికి చెందిన బస్సి ప్రకాష్ ద్వారా చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిషేధిత గంజాయిని అమ్మకం, సరఫరా చేస్తుందున వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

మృతదేహం ఆచూకీ గుర్తింపు

నిజాంసాగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టులో మంగళవారం పోలీసులు వెలికి తీసిన మృతదేహాన్ని ఆచూకీ బుధవారం కనుగొన్నారు. సాగర్‌లో పడి ఆత్మహత్య చేసుకున్న 45 సంవత్సరాల వ్యక్తి సంగారెడ్డి జిల్లా రాజంపేట గ్రామానికి చెందిన పందాల శివప్రసాద్ తండ్రి మల్లేష్‌గా గుర్తించారు. ఇతను మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నిజాంసాగర్‌లో పడి ఉన్న శవాన్ని పోలీసులు ముందుగా గుర్తు తెలియని శవముగా కేసు నమోదు చేసుకున్నారు. మృతుడు సంగారెడ్డి జిల్లా రాజంపేట కాలనీకి చెందిన వారుగా గుర్తించి పద్మశాలి కులానికి చెందినవారుగా ఇతను మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ ఉన్నారు. తాగుడుకు బానిసై నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావించారు. భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని శివప్రసాద్ బంధువులకు అప్పగించినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

అంబులెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

తాడ్వాయి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలానికి కాంగ్రెస్ ప్రభుత్వం 108 అంబులెన్స్‌ను మంజూరు చేసిందని అంబులెన్స్ నిర్వాహకులు తెలిపారు. దీనిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మంగళవారం నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.


ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న అంజలి

జిల్లాస్థాయి గణిత పోటీ పరీక్షలో ప్రతిభ కనబరిచిన అంజలి

ఎల్లారెడ్డి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గంజి జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి గణిత పోటీ పరీక్షల్లో ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాల విద్యార్థి అంజలి ప్రతిభ కనబరిచిన జిల్లా అధికారుల చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందజేసినట్లు ప్రిన్సిపాల్‌గాంధీ తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో భక్తుల పూజలు

బాన్సువాడ టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం నుంచి అయ్యప్ప మూలవిరాట్టుకు సుప్రభాతసేవ, అభిషేకాలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహానికి నవవిధ అభిషేకాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులున్నారు.


నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

సమస్యలు పరిష్కరించాలని రాస్తారోకో

రాజంపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని న్యూ బీసీ కాలనీ సమస్యలు అధికారులు పరిష్కరించడం లేదని బుధవారం కాలనీవాసులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పేరుకు మాత్రమే మండల కేంద్రంగా చేశారని సీసీరోడ్లు, డ్రైనేజీలు సరిగా లేవని బస్సు సైతం ఆపడం లేదని ఆరోపించారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని వాపోయారు. కాలనీవాసులు చేస్తున్న ధర్నా విషయం తెలుసుకున్న ఎస్‌ఐ పుష్పరాజ్, ఎంపీడీవో రఘురాం ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

పాఠశాలకు బోరు మోటార్ అందజేత

మాచారెడ్డి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాలలో నీటి కొరత ఉందని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి దృష్టికి పాఠశాల సిబ్బంది తీసుకుపోయారు. విద్యార్థులకు ఇబ్బందులు కావద్దని తన సొంత నిధులతో పాఠశాలకు మోటార్‌ను అందించారు. దీంతో ప్రభుత్వ సిబ్బంది ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

వంట చేస్తున్న వ్యక్తులు పరిశుభ్రత పాటించాలి

రాజంపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): వంట చేస్తున్న వ్యక్తులు పరిసరాల పరిశుభ్రత పాటించాలని జల్‌జీవన్ అండ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ సంస్థ డైరెక్టర్ వెంకటలక్ష్మీ అన్నారు. రాజంపేట కేజీబీవీ రెసిడెన్షియల్ పాఠశాల నందు న్యూట్రీషన్ ఫుడ్‌సేఫ్టీ హెల్తీఫుడ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో వంట చేస్తున్న వ్యక్తులు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎప్పటికప్పుడు తాజా కూరగాయలు వండే విధంగా చూడాలని, వంటచేసే వ్యక్తులు చేతి గ్లౌజ్‌లు, నోటి మాస్కులు, హెడ్‌క్యాప్స్ వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీవాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్న అధికారులు

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభం

తాడ్వాయి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం చేసినట్లు ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ తెలిపారు. ఆయన తాడ్వాయి, దేమికలాన్ గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామంలోని ఇల్లు లేని పేదలకు ఇళ్లు రావడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రహీముద్దీన్ ఎంపీవో సవితారెడ్డి, అధికారులు తదితరులు ఉన్నారు.

14న హోమియో ఆసుపత్రి ప్రారంభం

కామారెడ్డి టౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలోని 14వ వార్డులో ప్రభుత్వ హోమియో ఆసుపత్రి ప్రారంభిస్తున్నట్లు ఆయుష్ శాఖ జిల్లాప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. ఫ్రీడం ఫైటర్ భవనంలోకి ఆసుపత్రిని మార్చినందున ఔట్‌పేషంట్‌లు ఎవరైన ఉంటే కూడా సౌకర్యాలు పొందవచ్చని తెలిపారు.

'జర్నలిస్టులపై దాడి చేసిన మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి'

కామారెడ్డి టౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై దాడి చేసిన సినీనటుడు మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి జర్నలిస్టులు వినతిపత్రం అందించారు. అంతకు ముందు కలెక్టరేట్ ధర్నాచౌక్ వరకు ర్యాలీగా వచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నటుడు మోహన్‌బాబు అతని కుమారుడు మనోజ్ మధ్య జరుగుతున్న వివాదాన్ని కవరేజ్ చేసేందుకు వెళ్లిన జర్నలిస్టులపై మోహన్‌బాబు ఇష్టారీతిన తిడుతూ దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రజినీకాంత్, ఐజేయూ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు శ్రీనివాస్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో అయ్యప్ప స్వాముల నిరసన

ఎల్లారెడ్డి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పమాలలో ఉన్న జర్నలిస్టుపై సినీనటుడు మోహన్‌బాబు చేసిన దాడిని ఖండిస్తూ ఎల్లారెడ్డి అయ్యప్ప ఆలయం వద్ద అయ్యప్ప స్వాములు బుధవారం ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి వి.రాజేందర్ నాథ్, గురుస్వామి సమక్షంలో ఆందోళన చేశారు. నగేష్ గురు స్వామి మాట్లాడుతూ మాలలో ఉన్న స్వామిపై దాడి మహాపాపం అన్నారు. ఈ ఆందోళనలో గురు స్వాములు స్వామి, శ్రీనివాస్‌గౌడ్ స్వామి, మురళి, రమణలు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు ఉపాధ్యాయ సంఘాల మద్దతు


కామారెడ్డిలో సమ్మె నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు తీర్చాలని చేస్తున్న సమ్మె నాలుగో రోజుకు చేరింది. వీరికి పీఆర్‌టీయూ, డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాలు మద్దతు పలికాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు సమ్మె చేయడంతో కేజీబీవీలలో విద్యాబోధన, ప్రత్యేక అవసరాల పాఠశాలలో విద్యాబోధన ఆగిపోయిందని అన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం ఇచ్చిన హామీకి చర్చలకు సంబంధంలేకపోవడం బాధకరమని అన్నారు. అందుకే రాష్ట్ర నాయకులతో చర్చలు విఫలమైన్నట్లు తెలిపారు. మా న్యాయమైన డిమాండ్లకు మద్దతు ప్రకటిస్తామని ముందుకు వస్తున్న ఉపాధ్యాయ సంఘాలకు కృతజ్ఞతలు తెలుపుతూ రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుషాల్, డీటీఎఫ్ జనరల్ సెక్రెటరీ దేవుల, శ్రీనివాస్‌రెడ్డి, శ్యాం కుమార్, సంఘం జిల్లా సెక్రెటరీ సంపత్, నాయకులు శ్రీధర్‌కుమార్, రాములు, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగడంతో బుధవారం నుంచి మండల విద్యావనరుల కేంద్రానికి తాళం వేసి ఉంది. సమ్మెలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు సీఆర్‌పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్, మెస్సెంజర్, పీటీఐలు, పీఈటీలు, ఐఈఆర్‌పీలు, కస్తూర్బా గురుకుల పాఠశాలలకు చెందిన సిబ్బంది తమ డిమాండ్‌ల సాధన కోసం సమ్మె బాట పట్టారు. సమస్యలు పరిష్కరించని యెడల కేజీబీవీలతో పాటు గురుకుల పాఠశాలల్లో బోధన నిలిచిపోతుందని సమగ్ర శిక్ష జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు అశ్విని, రాజు, సంగాగౌడ్, విజయ్, గంగాధర్, రాజు స్వప్నలు ఉన్నారు.

తెలంగాణ పదాన్ని ఉచ్ఛరించే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదు

● మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి

రామారెడ్డి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పదాన్ని ఉచ్చరించే అర్హత ప్రతిపక్ష పార్టీ బీఆర్‌ఎస్ నాయకులకు లేదని కామారెడ్డి జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్, రామారెడ్డి మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరల దొరసాన్ని తీసుకొచ్చి తెలంగాణ తల్లి అంటే ఎలా సాగుతుందని, తెలంగాణకు నిలువెత్తు నిదర్శనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని గాంధీభవన్‌కు పంపిస్తామని మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులకు హెచ్చరిస్తున్నామని తెలిపారు. దొరల దొరసానిని గడియలకే పంపిస్తామని, లిక్కర్ స్కామ్ నుంచి తప్పించడానికి బిడ్డ కోసం బీఆర్‌ఎస్ పార్టీని ఏర్పాటు చేసి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. తెలంగాణ పదాన్ని మార్చారని అలాంటి మీకు తెలంగాణ పదాన్ని ఉచ్చరించే అర్హత లేదని హెచ్చరించారు. చాకలి ఐలమ్మ, సమ్మక్క సారలమ్మ ప్రతిరూపమే నేటి తెలంగాణ తల్లి అని అన్నారు. కాళేశ్వరంపై దోచుకున్న దొంగ డబ్బుతో జలసాలాడుతున్న మీకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. తస్మాత్ జాగ్రత్త, ఖబర్దార్ బీఆర్‌ఎస్ నాయకుల్లారా అని హెచ్చరించారు.


అయ్యప్ప ఆలయంలో దాతలను సన్మానిస్తున్న దృశ్యం

అయ్యప్ప ఆలయ అభివృద్ధికి సహకరించాలి

భిక్కనూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ సిద్ధరామేశ్వర ఆలయ సమీపంలో హరిహరపుత్ర ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని అయ్యప్ప సేవాసంఘం ప్రతినిధులు కోరారు. బుధవారం అయ్యప్ప ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధికి, అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలను ఘనంగా సన్మానించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో ప్రతిరోజు అన్నదాన కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సంఘం ప్రతినిధులు, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

అన్నప్రసాద సేవా సమితికి విరాళం

దోమకొండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ అన్నప్రసాద సేవా సమితికి గ్రామానికి చెందిన ముత్తగారి శిరీష్‌గౌడ్, రాహుల్‌గౌడ్ వారి తండ్రి జ్ఞాపకార్థం రూ.20,016, వార్షికోత్సవ కార్యక్రమానికి రూ.5,100లు బుధవారం అందజేసినట్లు సేవా సంఘం సభ్యులు నర్సారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అనీల్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, అయ్యప్ప స్వాములు వినోద్, సంతోష్, వెంకటేశం, రాజు, శేఖర్, భిక్షపతి, శ్రీనివాస్, తదిరులు పాల్గొన్నారు.


అన్నదానానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

ప్రభుత్వ పాఠశాలకు విరాళం

ఎల్లారెడ్డి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం అదే గ్రామానికి చెందిన గుడిపల్లి సంగ మేశ్వర్‌రెడ్డి వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిల్లలమర్రి శివ నరసింహారావుకు రూ.20వేల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


ప్రధానోపాధ్యాయుడికి చెక్కును అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూర్‌లో ఘనంగా ఖ్వాజా దర్గా ఉత్సవాలు


దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

నాగిరెడ్డిపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూరు గ్రామంలో వెంకట్ ఖ్వాజా దర్గా ఉత్సవాలు బుధవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమైన ఈ ఉత్సవాలు బుధవారం సాయంత్రం వరకు రెండు రోజుల పాటు ఘనంగా జరిగాయి. మెదక్ జిల్లా వట్పల్లి మండల కేంద్రంలోని వెంకట్ ఖ్వాజాదర్గా పీఠాధిపతి ముకుందరావు చిష్తీ ఆధ్వర్యంలో ఈ దర్గా ఉత్సవాలు నిర్వహించారు. దర్గా వార్షికోత్సవంలో భాగంగా ప్రతీ ఏటా దర్గా వద్ద ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారు. దీనిలో భాగంగానే దర్గా ఉత్సవాలు నిర్వహించారు. ఆత్మకూర్ గ్రామం నుంచి గంధం, చాదర్‌లను ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకువచ్చి దర్గాపై సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కుల మతాలకు అతీతంగా వెంకట ఖ్వాజా భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి దర్గా వద్ద ప్రార్థనలు చేశారు. అనంతరం ఖవ్వాలీ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు స్థానిక మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, నాగిరెడ్డిపేట దర్గా పీఠాధిపతి మహ్మద్ షరీఫొద్దీన్ శత్తారి ఉల్ ఖాద్రి, వెంకటఖ్వాజా భక్తులు మహ్మద్ తస్లీం చిష్తీ, గులాం మహ్మద్ ఖాజా చిష్తీ, పెంటయ్య చిష్తీ, అంజయ్య చిష్తీ, ప్రభులు చిష్తీ, వెంకట్ రాంరెడ్డి, వసంత్ రెడ్డి, భూంరెడ్డి, సుభాన్‌రెడ్డి, సాయులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	140	160	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

